# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-02-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో ప్రాజెక్టుల ఆమోదం సహా పలు అంశాలపై రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు చర్చిస్తోంది.**
2. **రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**
3. **యువతకు అన్ని రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు.**
4. **కూటమి ప్రభుత్వ 9 నెలల పాలనలో యువతకు ఎటువంటి ఉద్యోగాలు కల్పించలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి విమర్శించారు.**
5. **రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులందరినీ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రివర్గం చర్చిస్తోంది. 22-ఏ భూములు, విశాఖపట్నం పంచగ్రామాల సమస్య, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి-ఎస్ఐపీబీలో ప్రాజెక్టుల ఆమోదం పైనా చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో ఉద్యానవన సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్ నేతృత్వంలో రాయితీపై షేడ్‌నెట్స్ పంపిణీ కోసం సంబంధిత సంస్థలతో సెర్ప్ అధికారులు నిన్న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 5 వేల మంది డ్వాక్రా మహిళలకు 50 శాతం రాయితీతో షేడ్‌నెట్స్‌ను అందచేస్తామని చెప్పారు. ఈ ఏడాది మార్చి నాటికి 260 మందికి పంపిణీ చేసేందుకు వీలుగా చర్యలు చేపట్టామని, లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తయిందని వెల్లడించారు. ఒక్కో షేడ్ నెట్ వ్యయం 3.22 లక్షల రూపాయలు కాగా, అందులో 50 శాతం రాయితీని ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

--------------------------

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈ రోజు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు, రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలుపుతూ,

వాయిస్..28 సెకన్లు

---------------------------

యువతకు అన్ని రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా హిందూపురంలో చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు అధునాతన శిక్షణ ఇవ్వడానికి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో మూతపడిన ఈ కేంద్రాన్ని కూటమి ప్రభుత్వం అన్ని వసతులు కల్పించి, మళ్లీ ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను దశల వారీగా నెరవేరుస్తోందని తెలిపారు. అనంతరం నైపుణ్య శిక్షణ విభాగం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో శిక్షణ పొందిన 65 మందికి ధృవపత్రాలను మంత్రి అందజేశారు.

---------------------------

కూటమి ప్రభుత్వ 9 నెలల పాలనలో యువతకు ఎటువంటి ఉద్యోగాలను కల్పించలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు ఆయన రాష్ట్రంలోని తాజా పరిణామాలపై పాత్రికేయులతో మాట్లాడుతూ...

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పని చేసే కార్మికులందరినీ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ-శ్రమ్ పోర్టల్‌కు సంబంధించి రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, అసంఘటిత రంగంలో పని చేస్తున్న వారిలో ఇప్పటివరకు 81.52 లక్షల మంది వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించామని చెప్పారు. మిగతా వారి వివరాలను వేగంగా నమోదు చేయాలన్నారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలపై కార్మికులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇందులో చేరిన వారికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద 2 లక్షల రూపాయల ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు.

---------------------------

కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. గుంటూరులోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లా ఎన్నికల నియమావళిని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఎన్నికలకు

483 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని కలెక్టర్ తెలియజేస్తూ,..

వాయిస్ 22 సెకన్లు

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. పార్వతీపురంలోని కలెక్టర్ కార్యాలయంలో మాతా శిశు మరణాలపై ఈ రోజు నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్‌లో ప్రసూతి మరణాలు జరగకుండా, నివారణ చర్యలు కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది బాలింతలను సందర్శించి తల్లి, బిడ్డ యొక్క ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి తగిన చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని కుంభ మేళాలో జన్ జాతి సాంస్కృతిక సమాగం 2025 ఈరోజు ప్రారంభమైంది. మొత్తం ఆరు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 15వేల మంది గిరిజనులు పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను తెలిపేలా పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. గిరిజన నాయకులు స్వాతంత్ర్య సమరయోధులు భగవాన్ బిర్సా ముండా 150వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రప్రభుత్వం 2025వ సంవత్సరాన్ని జన్ జాతీయ గౌరవ్ వర్ష్‌గా ప్రకటించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. అనంతపురం ఆకాశవాణి ప్రాంతీయ కార్యాలయంలో పంచాయతీరాజ్ సమస్యలపై నిర్వహించిన “అనంత మిత్ర” ఫోన్ ఇన్ ప్రత్యక్ష కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని శ్రోతలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో కలెక్టర్ సంభాషించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వినోద్ కుమార్ మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

=====================